హైదరాబాద్‌లో మైసన్ సియా స్టోర్

హైదరాబాద్, నవంబర్ 7: గృహాలంకరణ ఉత్పత్తుల విక్రయ సంస్థ మైసన్ సియా..తాజాగా హైదరాబాద్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. తన తొలి స్టోర్‌ను మంగళవారం ప్రారంభించింది. 3 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌లో ప్రపంచంలోని అత్యుత్తమ అలంకరణానికి సంబంధించిన లగ్జరీ ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. యూరోపియన్‌లో ఉన్న అనుభూతిని పొందే విధంగా ఈ స్టోర్‌ను డిజైన్ చేసినట్టు కంపెనీ ఫౌండర్, సీఈవో వాటికా అగర్వాల్ తెలిపారు.

కిమ్స్ హాస్పిటల్స్ భారీ విస్తరణ

హైదరాబాద్, నవంబర్ 7: ప్రముఖ వైద్య సేవల సంస్థ కిమ్స్ హాస్పిటల్స్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను కంపెనీ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 4.5 శాతం తగ్గి రూ.101 కోట్లకు పడిపోయింది. ఆదాయం మాత్రం 14.3 శాతం పెరిగి రూ.573 కోట్ల నుంచి రూ.655 కోట్లకు పెరిగినట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. జూన్ త్రైమాసికంలో నమోదైన రూ.80.8 కోట్లతో పోలిస్తే మాత్రం 15 శాతం ఎగబాకింది. గత త్రైమాసికంలో రోగుల సంఖ్య క్రమంగా పెరిగారని, వచ్చే రెండేండ్లలో పడకల సంఖ్యను 8 వేలకు పెంచడానికి తమ వ్యాపార విస్తరణ ప్రణాళిక యథాతథంగా కొనసాగుతున్నదని కిమ్స్ హాస్పిటల్ సీఎండీ డాక్టర్ బీ భాస్కర్ రావు తెలిపారు. బెంగళూరు, నాసిక్, ముంబైలో ఏర్పాటు చేస్తున్న ఆసుపత్రులు వచ్చే ఆర్థిక సంవత్సరంలో అందుబాటులోకి రావచ్చునని చెప్పారు.

ఆకట్టుకున్న నెట్‌లింక్స్

హైదరాబాద్, నవంబర్ 7: రాష్ట్రానికి చెందిన ఐఎస్‌పీ, ఐటీ/ఐటీఈఎస్ సేవల సంస్థ నెట్‌లింక్స్ లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో సంస్థ రూ.4.71 కోట్ల ఆదాయాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2.39 కోట్ల ఆదాయంతో పోలిస్తే 100 శాతం పెరిగింది. అలాగే పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభం రూ.37 లక్షల నుంచి రూ.1.34 కోట్లకు చేరుకున్నది.

వుయ్‌వర్క్ దివాలా

బ్యాంక్రప్టసీ చట్టం రక్షణ కోరుతూ అమెరికాలో పిటిషన్ దాఖలు

హైదరాబాద్‌సహా దేశవ్యాప్తంగా సేవలు

న్యూయార్క్, నవంబర్ 7: కో-వర్కింగ్ స్పేస్ సేవల దిగ్గజం వుయ్‌వర్క్ దివాలా తీసింది. 13 ఏండ్ల క్రితం అమెరికాలో మొదలైన వుయ్‌వర్క్.. 39 దేశాలకు విస్తరించి, 777 చోట్ల తమ వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్నది. ఆయాచోట్ల 9 లక్షలకుపైగా డెస్కులున్నాయి. 5.47 లక్షల సభ్యులున్నారు. ఈ క్రమంలోనే ఒకానొక దశలో సంస్థ విలువ 47 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.4 లక్షల కోట్లు)గా నమోదైంది. అయితే 2019లో ఐపీవోకు ప్రయత్నించి విఫలమైంది. అప్పట్నుంచే సంస్థకు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. అప్పటికే కంపెనీ విలువ 10 బిలియన్ డాలర్లకు పడిపోవడం గమనార్హం. 2021 అక్టోబర్‌లో ఐపీవో విజయవంతమైనా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలోనే ఇప్పుడు దివాలా చట్టం కింద రుణాల పునర్‌వ్యవస్థీకరణకు వెళ్తున్నది. సోమవారం న్యూజెర్సీలోని డిస్ట్రిక్ట్ కోర్టులో చాప్టర్ 11 బ్యాంక్రప్టసీ కింద రక్షణను కోరుతూ పిటిషన్ వేసింది.

కరోనా దెబ్బ

కరోనా దెబ్బకు ప్రపంచవ్యాప్తంగా అన్ని కంపెనీలు వర్క్‌ఫ్రం హోం దిశగా అడుగులు వేసిన విషయం తెలిసిందే. దీంతో ఆఫీస్ మార్కెట్‌లో డిమాండ్ ఒక్కసారిగా క్షీణించింది. అమెరికా, యూరప్, ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా తదితర అన్ని దేశాలు, ఖండాల్లోనూ ఆఫీస్ స్పేస్ లీజింగ్ ఇంచుమించుగా స్తంభించిపోయింది. ఈ పరిణామం వుయ్‌వర్క్ బిజినెస్‌ను భారీగా దెబ్బతీసింది. దీంతో సంస్థపై రుణభారం కూడా తీవ్రతరమైంది. మరోవైపు మేనేజ్‌మెంట్ నిర్ణయాలూ సంస్థను మరింత నష్టపరిచాయి. ముఖ్యంగా ఇతర సంస్థల కొనుగోళ్లు లేనిపోని సమస్యల్ని తెచ్చిపెట్టాయి. ఎక్కువ ధరపెట్టి కొనడం వాటాదారులకు ఏమాత్రం రుచించలేదు. ఈ నేపథ్యంలోనే సంస్థలోని మెజారిటీ భాగస్వాములు.. అప్పుల్ని తగ్గించుకోవాలని, అలాగే సంస్థకున్న కమర్షియల్ ఆఫీస్ లీజ్ పోర్ట్‌ఫోలియోనూ మదింపాలని పట్టుబట్టారు. దీంతో దివాలా ప్రక్రియే దారైంది.

భారత్‌పై ప్రభావం లేదు

వుయ్‌వర్క్ గ్లోబల్ దివాలా.. వుయ్‌వర్క్ ఇండియాపై ఏ రకంగానూ ప్రభావం చూపబోదని, ఇందులోని మెజారిటీ భాగస్వామైన బెంగళూరు ఆధారిత రియల్టీ సంస్థ ఎంబసీ గ్రూప్ మంగళవారం అన్నది. వుయ్‌వర్క్ ఇండియాలో 73 శాతం వాటా ఎంబసీ గ్రూప్‌దే. మిగతా 27 శాతం వాటా వుయ్‌వర్క్ గ్లోబల్‌ది. వుయ్‌వర్క్ ఇండియాకు హైదరాబాద్‌సహా దేశంలోని ఏడు నగరాల్లో 50 సెంటర్లున్నాయి. ఇక్కడ దాదాపు 90వేల డెస్కులున్నాయి. ఈ క్రమంలోనే వుయ్‌వర్క్ గ్లోబల్‌లో భారతీయ వ్యాపారం.. స్వతంత్రంగా ఉందని వుయ్‌వర్క్ ఇండియా సీఈవో కరణ్ విర్వాణి ఓ ప్రకటనలో తెలిపారు.

మార్కెట్ విలువ ఆవిరి

ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో వుయ్‌వర్క్ మార్కెట్ క్యాపిటలైజేషన్ పెద్ద ఎత్తున పడిపోయింది. సంస్థ షేర్ విలువ ఏకంగా 98 శాతం క్షీణించింది. ఒకప్పుడు 47 బిలియన్ డాలర్లుగా ఉన్న కంపెనీ మార్కెట్ విలువ.. ఇప్పుడు 50 మిలియన్ డాలర్లలోపే. సంస్థకు నికర దీర్ఘకాలిక రుణ భారం 2.9 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు ఆగస్టులో వుయ్‌వర్క్ ప్రకటించింది. అలాగే 13 బిలియన్ డాలర్లకుపైగా దీర్ఘకాలిక లీజులున్నాయి.

అందువల్ల ఈ దివాలా వల్ల వుయ్‌వర్క్ ఇండియాకు వచ్చిన ఇబ్బందేమీ లేదన్నారు. తమ సభ్యులు, భూస్వాములు, భాగస్వాములకు ఎప్పట్లాగే వుయ్‌వర్క్ నుంచి సేవలు అందుతాయని స్పష్టం చేశారు. అంతేగాక వుయ్‌వర్క్ ఇండియా బిజినెస్‌లో మరిన్ని పెట్టుబడులకూ కట్టుబడి ఉన్నామని కరణ్ స్పష్టం చేశారు. 2021 నుంచి వుయ్‌వర్క్ ఇండియా లాభాల్లో ఉన్నట్టు గుర్తుచేశారు. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో కంపెనీ రెవిన్యూ 40 శాతం పెరిగి రూ.400 కోట్లకు చేరిందని చెప్పారు. దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో కార్పొరేట్ సంస్థల నుంచి ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్‌కు డిమాండ్ పెరుగుతున్నట్టు వివరించారు. ఇక గత ఆర్థిక సంవత్సరం (2022-23) కంపెనీ టర్నోవర్ రూ.1,400 కోట్లుగా నమోదైంది.

50 కోట్లు @ ఫోన్‌పే

న్యూఢిల్లీ, నవంబర్ 7: ఆర్థిక సేవల సంస్థ ఫోన్‌పే మరో రికార్డును సాధించింది. 50 కోట్ల మంది కస్టమర్లు ఫోన్‌పే సేవలను వినియోగించుకుంటున్నారు. అంతర్జాతీయంగా 50 కోట్ల మంది యూజర్లు కలిగిన తొలి భారతీయ సంస్థ ఫోన్‌పే కావడం విశేషం. ఈ సందర్భంగా ఫోన్‌పే ఫౌండర్, సీఈవో సమీర్ నిగమ్ మాట్లాడుతూ..స్వల్ప కాలంలోనే 50 కోట్ల మైలురాయికి చేరుకోవడం చాలా సంతోషంగా ఉన్నదని, సంస్థ పెట్టుకున్న 100 కోట్ల భారతీయుల్లో సగానికి చేరుకున్నట్టు తెలిపారు. జనవరి 2022 నాటికి 35 కోట్ల యూజర్లకు చేరుకున్న సంస్థ..ఆ మరుసటి ఏడాదిన్నరలోగా మరో 15 కోట్ల కస్టమర్లను ఆకట్టుకోవడం విశేషమన్నారు. ప్రతి ముగ్గురి భారతీయుల్లో ఒక్కరు ఫోన్‌పేను వినియోగిస్తున్నారు. కేవలం ఏడేండ్లలో ఈ మైలురాయికి చేరుకున్నది. ఆగస్టు, 2016లో ఫోన్‌పే ఆర్థిక సేవలు ఆరంభించిన విశేషం తెలిసిందే.

బ్యాంకుల దీపావళి ధమాకా

న్యూఢిల్లీ, నవంబర్ 7: రిటైల్ వినియోగాన్ని పెంచేక్రమంలో ఈ దీపావళికి ప్రముఖ బ్యాంక్‌లు వాటి ఖాతాదారులకు డెబిట్, క్రెడిట్ కార్డులపై జోరుగా వివిధ రకాల ఆఫర్లు ఇస్తున్నాయి. ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్‌లు పలు బ్రాండ్లు, డిజిటల్ సంస్థలతో కలిసి ఎన్నో డీల్స్, డిస్కౌంట్లు అందిస్తున్నాయి. ప్రధాన ఆఫర్ల వివరాలివి..

ఎస్బీఐ క్రెడిట్ కార్డ్

- ఎలక్ట్రానిక్ ఐటమ్స్, గాడ్జెట్స్, ఫ్యాషన్, లైఫ్‌స్టైల్, జ్యువెలరీ, ట్రావెల్ తదితరాలపై డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్‌లను అందిస్తున్నది.
- బాష్ ఉత్పత్తులపై 20 శాతం తక్షణ డిస్కౌంట్, ఫ్లిప్‌కార్ట్‌లో కొనుగోళ్లపై 10 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్, హైయర్ ఉత్పత్తులపై 22.5 శాతం వరకూ ఇన్‌స్టంట్ డిస్కౌంట్, మింత్రా షాపింగ్‌పై 10 శాతం డిస్కౌంట్, మ్యాక్స్, పాంటలూన్స్, మాంటె కార్లో, రేమండ్‌లపై 5 శాతం క్యాష్‌బ్యాక్, శాంసంగ్ స్మార్ట్‌ఫోన్లపై రూ.5,000 వరకూ క్యాష్‌బ్యాక్, ఒప్పో స్మార్ట్‌ఫోన్స్‌పై 10 శాతం డిస్కౌంట్, వివో స్మార్ట్‌ఫోన్స్‌పై రూ.10,000 వరకూ డిస్కౌంట్ వంటి ఆఫర్లు ఎస్బీఐ క్రెడిట్ కార్డ్‌పై లభిస్తాయి.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డెబిట్, క్రెడిట్ కార్డ్‌లు

- ఎలక్ట్రానిక్స్, గాడ్జెట్స్, హోంకేర్, లైఫ్‌స్టైల్ తదితర ఉత్పత్తులపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వివిధ పండుగ ఆఫర్లను ఇటీవల ప్రవేశపెట్టింది.
- ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్‌లో హెచ్‌డీఎఫ్‌సీ కార్డుల ద్వారా జరిపే కొనుగోళ్లపై రూ.26,000 వరకూ ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్‌తో పాటు ఈజీ ఈఎంఐలు లభిస్తాయి.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డులు, ఈజీ ఈఎంఐల ద్వారా కొనుగోలు చేసే యాపిల్ శ్రేణి ఉత్పత్తులపై రూ.5,000 వరకూ ఆదా.
- రిలయన్స్ రిటైల్‌లో హెచ్‌డీఎఫ్‌సీ కార్డులు, ఈజీ ఈఎంఐలతో కొనే టెలివిజన్లు, వాషింగ్ మెషిన్లపై రూ.7,500 వరకూ క్యాష్‌బ్యాక్
- శాంసంగ్ మొబైల్‌లో క్రెడిట్ కార్డుల ద్వారా జరిపే కొనుగోళ్లకు, తీసుకునే కన్జూమర్ లోన్స్, ఈజీ ఈఎంఐలపై రూ.12,000 క్యాష్‌బ్యాక్
- క్రెడిట్ కార్డులతో మేక్ మై ట్రిప్‌లో డొమెస్టిక్ ఫ్లైట్స్ బుకింగ్‌పై 20 శాతం వరకూ తగ్గింపు

ఐసీఐసీఐ బ్యాంక్ డెబిట్, క్రెడిట్ కార్డులు

- 'ఫెస్టివ్ బొనంజా' పేరుతో ఐసీఐసీఐ బ్యాంక్..ఎలక్ట్రానిక్స్, మొబైల్స్, ఫ్యాషన్, జ్యువెలరీ, ఫర్నీచర్, ట్రావెల్, డైనింగ్‌పై ఆఫర్లు, డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్‌లను ప్రకటించింది.
- ప్రముఖ బ్రాండ్లు ఐఫోన్, మేక్ మై ట్రిప్, టాటా న్యూ, ఒన్‌ప్లస్, హెచ్‌పీ, మైక్రోసాఫ్ట్, క్రోమా, రిలయన్స్ డిజిటల్, ఎల్‌జీ, సోనీ, శాంసంగ్, తనిష్క్, తాజ్, జొమాటో, స్విగ్గీ కొనుగోళ్లపై ఆఫర్లు అందుతాయి.
- డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా రిలయన్స్ డిజిటల్‌లో కొన్ని ఉత్పత్తుల కొనుగోళ్లపై రూ.10,000 వరకూ డిస్కౌంట్ లభిస్తుంది.
- శాంసంగ్ అవుట్‌లెట్స్‌లో డెబిట్, క్రెడిట్ కార్డులపై 22.5 శాతం వరకూ (గరిష్ఠంగా రూ.25,000) క్యాష్‌బ్యాక్
- ఎల్‌జీలో డెబిట్, క్రెడిట్ కార్డు ఈఎంఐలపై రూ. 26,000 వరకూ 26 శాతం క్యాష్‌బ్యాక్
- ఒన్ ప్లస్ మొబైల్స్‌పై రూ.5,000 వరకూ డిస్కౌంట్. షావోమి మొబైల్స్‌పై రూ.7,500 వరకూ డిస్కౌంట్
- మేక్ మై ట్రిప్, యాత్ర, ఈజీ మై ట్రిప్‌ల్లో ఫ్లైట్ టికెట్స్‌పై 12 శాతం డిస్కౌంట్

కొటక్ మహీంద్రా బ్యాంక్ డెబిట్, క్రెడిట్ కార్డులు

- కొటక్ మహీంద్రా బ్యాంక్ వెబ్‌సైట్‌లో సమాచారం ప్రకారం ఈ బ్యాంక్ డెబిట్, క్రెడిట్ కార్డులు, క్రెడిట్ ఈఎంఐలపై ఆఫర్లు ఉన్నాయి
- కొటక్ క్రెడిట్ కార్డు ఈఎంఐలపై శాంసంగ్‌లో సెలక్ట్ ఐటెమ్స్ కొనుగోళ్లకు రూ.25,000 వరకూ క్యాష్‌బ్యాక్
- ఐఎఫ్‌బీ అవుట్‌లెట్స్‌లో క్రెడిట్ కార్డు ఈఎంఐలపై రూ.9,000 వరకూ 20 శాతం క్యాష్‌బ్యాక్
- గోద్రేజ్‌లో కొన్ని ఉత్పత్తులపై డెబిట్ కార్డు ఈఎంఐ, స్మార్ట్ ఈఎంఐ కార్డులపై రూ.5,000 వరకూ క్యాష్‌బ్యాక్
- వర్ల్‌పూల్‌లో క్రెడిట్ కార్డు ఈఎంఐలపై రూ.7,500 వరకూ 15 శాతం క్యాష్‌బ్యాక్

టీహబ్‌తో బోయింగ్ ఇండియా జట్టు

ప్రారంభ దశలో ఉన్న స్టార్టప్‌ల ప్రోత్సాహం కోసం..

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): ప్రారంభ దశలో ఉన్న స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకుగాను టీ హబ్‌తో బోయింగ్ ఇండియా జత కట్టింది. అత్యాధునిక టెక్నాలజీతో వివిధ రంగాల్లో అద్భుతమైన ఆవిష్కరణలు చేసేందుకు వేదికగా ఉన్న టీహబ్‌తో బిల్డ్ పేరుతో ప్రత్యేక స్టార్టప్ ప్రోత్సాహక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు రెండు విడతలుగా చేపట్టిన కార్యక్రమానికి మంచి స్పందన రావడంతో మూడో విడత బిల్డ్ కార్యక్రమాన్ని టీ హబ్, బోయింగ్ ఇండియాలు సంయుక్తంగా నిర్వహించబోతున్నాయి. గతంలో నిర్వహించిన బిల్డ్ 2.0 కార్యక్రమానికి తెలంగాణ, ఏపీల నుంచి 159 దరఖాస్తులు రాగా, వీటిలో 32 దరఖాస్తులను ఎంపిక చేశారు. వీటిలోంచి 10 స్టార్టప్‌లను గుర్తించి, వాటిని ప్రోత్సహిస్తున్నారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఒక స్టార్టప్‌నకు రూ.10 లక్షల నగదు బహుమతిని బోయింగ్ ఇండియా అందించనున్నది. ఆసక్తి ఉన్నవారు టీ హబ్ వెబ్ సైట్ లేదా (https://bit.ly/3EO0oLT)ద్వారా దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

టీవీఎస్ సరికొత్త ఆటో

బెంగళూరు, నవంబర్ 7: ప్రముఖ వాహన సంస్థ టీవీఎస్ మోటర్..దేశీయ మార్కెట్లోకి సరికొత్త ఆటోను పరిచయం చేసింది. టీవీఎస్ కింగ్ డ్యూరామాక్స్ ప్లస్ పేరుతో విడుదల చేసిన రెండు మాడళ్లు సీఎన్‌జీ, పెట్రోల్ రకాల్లో లభించనున్నది. 225 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన ఈ ఆటోలో సీఎన్‌జీ రకం ధర రూ.2,57,190, పెట్రోల్ రకం రూ.2,35,552 నిర్ణయించింది. ఈ ధరలు బెంగళూరు షోరూంనకు సంబంధించినవి. ఈ సందర్భంగా టీవీఎస్ బిజినెస్ హెడ్ రజత్ గుప్తా మాట్లాడుతూ..కస్టమర్లకు నూతన వాహనాలు అందించడంతో తాము పెట్టుకున్న కమిట్‌మెంట్‌కు ఈ వాహనం నిదర్శనమని, ఇన్నోవేషన్, కస్టమర్లకు అధిక ప్రయోజనాలు కల్పించడానికి ప్రత్యేకంగా ఈ వాహనాన్ని రూపొందించినట్టు చెప్పారు.

సుప్రీం ఆదేశాలు భేఖాతర్

అధిక పింఛన్‌దారులపై ఎటూ తేల్చని కేంద్రం

ధరఖాస్తులు స్వీకరించి పక్కనపెట్టిన ఈపీఎఫ్‌వో

కేంద్రం వైఖరిపట్ల మండిపడుతున్న ఉద్యోగ సంఘాలు

స్పెషల్ టాస్క్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): రిటైర్డు ఉద్యోగులపట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై ఉద్యోగ, కార్మిక సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. అర్హులైనవారికి అధిక పింఛన్‌పై పెన్షన్ చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించి సరిగ్గా ఏడాది అవుతున్నా నరేంద్ర మోదీ సర్కార్‌లో చలనం కలగడం లేదు. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మొక్కుబడిగా ఈపీఎఫ్‌వో దరఖాస్తులు స్వీకరించి చేతులు దులిపేసుకున్నది. తదుపరి చర్యలు చేపట్టడంలో కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని ఎంప్లాయిస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) అనుసరిస్తున్న నిర్లక్ష్యంపై కోర్టు ధిక్కరణ వ్యాజ్యం వేస్తామని జాతీయ స్థాయిలో ఉద్యోగ, కార్మిక సంఘాలు తీవ్రంగా హెచ్చరిస్తున్నాయి.

దేవుడు వరమిచ్చినా కరుణించలేదు..

అధిక పెన్షన్ కోసం ఉద్యోగులు, కార్మిక సంఘాలు ఏండ్ల తరబడి చేస్తున్న న్యాయపోరాటం ఫలితంగా ఎట్టకేలకూ గతేడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు వారికి అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈపీఎఫ్‌వో పరిధిలోకి వచ్చే అర్హులైన కార్మికులు, ఉద్యోగులకు అధిక పింఛను చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు అధిక పింఛన్‌కు అర్హులైనవారి నుంచి ఈపీఎఫ్‌వో దరఖాస్తులు స్వీకరించింది. వాటిని పరిశీలించి, అధిక పింఛన్ చెల్లించడానికి చర్యలు చేపట్టాల్సిన ఈపీఎఫ్‌వో.. మార్గదర్శకాల పేరిట అనేక కొర్రీలు పెట్టింది. ఆ మార్గదర్శకాలు పెన్షనర్లకు అధిక పింఛన్‌ను ఏ విధంగానైనా ఎగ్గొట్టే విధంగా ఉన్నాయని కార్మిక సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. మొదట జారీ చేసిన నిబంధనలను మార్పు చేయడంతోపాటు దరఖాస్తుల స్వీకరణకు గడువు కూడా పెంచింది. ఆ తర్వాతైనా అధిక పింఛన్ అమల్లోకి వస్తుందని పెన్షనర్లు గంపెడాశ పెట్టుకున్నా, ఇప్పటికీ ఎటూ తేల్చకుండా తాత్సారం చేయడంపట్ల కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేసినా కేంద్ర నుంచి ఉలుకూ పలుకూ లేదు.

33 వేల మందికి నోటీసులు

అధిక పింఛన్‌దారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తైనప్పటికీ ఈపీఎఫ్‌వో నుంచి స్పష్టత లేకపోవడం వల్లనే వాటిని పరిష్కరించలేకపోతున్నట్టు ప్రాంతీయ కార్యాలయాలు వాపోతున్నాయి. దేశవ్యాప్తంగా అధిక పింఛన్ కోసం 17.48 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా..వీరిలో 32,951 దరఖాస్తుదారులకు మాత్రమే అదనంగా చెల్లించాల్సిన మొత్తానికి డిమాండ్ నోటీసులు జారీ చేసింది. అందిన దరఖాస్తులలో ఇది కేవలం 1.8 శాతం మాత్రమే. అధిక పింఛన్‌కు అర్హత పొందడానికి ఉద్యోగులు చెల్లించాల్సిన బకాయిల మొత్తం రూ.1,974 కోట్లుగా అంచనా వేసింది. డిమాండ్ నోటీసులు అందుకున్న వారిలో కొందరు అదనపు మొత్తాన్ని కూడా చెల్లించినప్పటికీ పింఛన్ గణనపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం తదుపరి చర్యలు చేపట్టలేకపోతున్నట్టు ప్రాంతీయ కార్యాలయాలు చెబుతున్నాయి.

అంతా గందరగోళం

అధిక పింఛన్‌కు అర్హత కలిగిన ఉద్యోగులు ఈపీఎఫ్ చందాను మూలవేతనంతో డీఏ కలిపి మొత్తంగా 8.33 శాతాన్ని లెక్కించాల్సి ఉండగా ఈపీఎఫ్‌వో మాత్రం 9.49 శాతం చెల్లించాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇది ఫించన్‌దారులకు పెనుభారంగా మారుతున్నది. అయినప్పటికీ పింఛన్ లెక్కింపు విధానానికి కట్టుబడి ఉంటామని దరఖాస్తుదారుల నుంచి అఫిడవిట్ తీసుకోవడం వల్ల ఖరారు చేసిన మేరకు అధిక మొత్తం చెల్లించడానికి కూడా ఉద్యోగులు అంగీకరించారు. ఇలా ఉండగా ప్రాంతీయ కార్యాలయాలు పార్ట్-1, పార్ట్-2 విధానానికి తెరపైకి తీసుకరావడంతో గందరగోళానికి దారితీసింది. దీనిపై కార్మిక సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేసాయి. ఈ విధానం సరికాదని, ప్రభుత్వానికి అధిక పింఛన్ చెల్లించే ఉద్దేశం లేకనే మొదటి నుంచి అనేక కొర్రీలు పెడుతుందని ధ్వజమెత్తాయి. ఈపీఎఫ్‌వో నుంచి స్పష్టత వచ్చాకే దరఖాస్తులను పరిష్కరించగలమని ప్రాంతీయ కార్యాలయాలు చేతులు ఎత్తేసాయి.

13 లక్షల మందికి దెబ్బ

ఈపీఎఫ్‌వో తాజా నిర్ణయంతో అధిక పింఛన్‌ను ఆశిస్తున్నవారికి పెద్ద దెబ్బే తగిలింది. అధిక పింఛన్ కోసం అప్షన్ ఇచ్చిన దరఖాస్తుదారులలో ఏకంగా 13 లక్షల మందికి చెల్లించాల్సిన మొత్తంలో మూడో వంతు కోత పడనుంది. సెప్టెంబర్ 1, 2014 తర్వాత రిటైరైన ఉద్యోగులతోపాటు ప్రస్తుతం సర్వీసులో కొనసాగుతున్న ఉద్యోగులపై ఈ ప్రభావం పడనుంది. అధిక పింఛన్ చెల్లించడానికి సదరు ఉద్యోగుల వేతనంలో రిటైర్మెంట్ ముందటి 60 నెలల సగటు వేతనాన్ని పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇది గత విధానానికి భిన్నం. రిటైర్ కావడానికి ముందు అధిక వేతనం పొందిన ఉద్యోగులకు పూర్తి పెన్షన్ పొందడానికి అర్హులు కాదని ఈపీఎఫ్‌వో తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

స్వదేశ్ స్టోర్ నేడు ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 7: భౌగోళిక గుర్తింపు కలిగిన దేశీయ హస్తకళా ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు, వ్యవసాయోత్పత్తులతో కూడిన స్వదేశ్ స్టోర్ హైదరాబాద్‌లో బుధవారం ప్రారంభం కానున్నది. హ్యాండీక్రాఫ్ట్స్, ఆర్ట్ ఆబ్జెక్ట్స్, ఫర్నీచర్, మాస్కులు, టాయ్స్, పప్పెట్స్, జ్యువలరీ, డైనింగ్, కిచెన్‌కు హోంవేర్, పెయింటింగ్స్, అప్పారల్, షాల్స్, ఫ్యాబ్రిక్స్, శారీస్, హోంలినెన్, వెల్‌నెస్ ఉత్పత్తులు తదితరాలు లభిస్తాయని సంస్థ తెలిపింది. జూబ్లీహిల్స్, రోడ్ నం.36, అల్కజార్ మాల్‌లో స్వదేశ్ స్టోర్ ఏర్పాటైంది.

వరుస లాభాలకు బ్రేక్

ముంబై, నవంబర్ 7: స్టాక్ మార్కెట్ల వరుస లాభాలకు బ్రేక్ పడింది. వరుసగా మూడు రోజులుగా ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు నష్టాల్లోకి జారుకునేటట్టుచేశాయి. అలాగే విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను ఉపసంహరించుకోవడం సూచీలకు రుచించలేదు. ఒక దశలో 320 పాయింట్లు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 16.29 పాయింట్లు కోల్పో 64,942.40 వద్ద ముగియగా, నిఫ్టీ 5 పాయింట్లు కోల్పోయి 19,406.70 వద్ద ముగిశాయి. మార్కెట్లో బజాజ్ ఫైనాన్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, రిలయన్స్, మహీంద్రా, ఐటీసీ, టీసీఎస్, షేర్లు నష్టపోయాయి. కానీ, సన్ ఫార్మా, ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌ల షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ 1.21 శాతం, ఆటో, కన్జ్యూమర్ డ్యూరబుల్, మెటల్, టెక్నాలజీ రంగ షేర్లు నష్టపోగా..ఆయిల్ అండ్ గ్యాస్, హెల్త్‌కేర్, బ్యాంకింగ్, ఎనర్జీ, సేవల రంగ సూచీలు లాభాల్లో ముగిశాయి.

స్థిరాస్తి లావాదేవీల్లో నగదు హవా

డీమానిటైజేషన్ వార్షిక సర్వేలో వెల్లడి

ముంబై, నవంబర్ 7: స్థిరాస్తి లావాదేవీల్లో నగదు వాడకం క్రమేణా పెరుగుతున్నట్టు ఓ తాజా నివేదికలో తేలింది. డీమానిటైజేషన్ జరిగి ఏడేండ్లు పూర్తయిన సందర్భంగా ఓ వార్షిక సర్వే విడుదలైంది. సోషల్ మీడియా వేదిక లోకల్‌సర్కిల్స్ దేశవ్యాప్తంగా 363 జిల్లాల్లో ఈ సర్వేను చేపట్టింది. ఇందులో 44వేల మంది పాల్గొన్నారు. గత ఏడేండ్లలో వీరిలో మెజారిటీ శాతం ఇండ్లను కొన్నవారే. కాగా, వీళ్లలో 24 శాతం మందే ప్రాపర్టీ కొన్నప్పుడు నగదు రూపంలో చెల్లింపులు జరుపలేదని ఈసారి చెప్పారు. రెండేండ్ల క్రితం ఇది 30 శాతంగా ఉన్నట్టు సర్వే పేర్కొన్నది. ఇక 28 శాతానికిపైగా తాము ఇండ్లు కొన్నప్పుడు ఆ విలువలో 10-20 శాతం నగదు రూపంలోనే చెల్లించామన్నారు. 15 శాతం మందైతే 50 శాతానికిపైగా నగదు ఇచ్చినట్టు చెప్పారు. 30-50 శాతం మేర నగదులో చెల్లించినవారు 18 శాతంగా ఉన్నట్టు స్పష్టమైంది.